క్లుప్తంగా

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో మంగళవారం స్థానిక జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సీఐ పాల్గొని మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే పట్టుదల, క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎస్సై శ్యామ్‌రాజ్, కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, మహాజన్ నర్సింహులు, కమలాకర్ తదితరులున్నారు.

నకిలీ మందులు, విత్తనాలు అమ్మితే కఠినచర్యలు



బీర్‌పూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఏవో, ఎస్సై

సారంగాపూర్: రైతులకు నకిలీ విత్తనాలు, కల్తీ మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని బీర్‌పూర్ ఏవో అనూష, ఎస్సై అజయ్ అన్నారు. మంగళవారం మండలంలోని బీర్‌పూర్, తుంగూర్, కొల్వాయి గ్రామాల్లోని ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. రైతులు ఏ దుకాణంలో విత్తనాలు, మందులు కొన్నా వాటికి రసీదు తీసుకోవాలని, ఆ రసీదును పంట చేతికి వచ్చే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు.

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో మండల వ్యవసాయధికారి పర్లపెల్లి జ్యోతి హెడ్ కానిస్టేబుల్ సౌందర్య మంళవారం తనిఖీ చేపట్టారు. విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్ వివరాలను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతు తాము కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లు తీసుకోని పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచుకోవాలన్నారు.

పని వేళలు తగ్గించాలని జీపీ కార్మికుల వినతి

కొండగట్టు: ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందునా పనివేళలు తగ్గించాలని పంచాయతీ కార్మికులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 9 గంటల వరకు పనులు చేసేలా అవకాశం ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు మంగళవారం మండల పంచాయతీ అధికారి కార్యాలయంలో ఆపరేటర్‌కు వినతిపత్రం అందించారు.

11వ వార్డులో 'మేరా లైఫ్ మే స్వచ్ఛ షహర్'

రాయికల్: పట్టణంలోని 11వ వార్డులో మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో పనికిరాని పక్కకు పెట్టిన వస్తువులను మున్సిపల్ సిబ్బందికి అందించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల అనురాధ, మేనేజర్ వెంకట్, వార్డు ఆఫీసర్ ఫయాజ్, ఆర్పీ జ్యోత్స్న, నాయకులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలు అరికట్టవచ్చు



అవినాష్‌ను సన్మానిస్తున్న ఎస్సై, నాయకులు

గొల్లపల్లి: సీసీ కెమెరాలతో నేరాలను అరికట్టవచ్చని ఎస్సై దత్తాత్రి అన్నారు. సినీ హాస్యనటుడు, జబర్దస్త్ ఫేం ముక్కు అవినాష్ తన సొంత గ్రామం రాఘవపట్నంకు 8 సీసీ కెమెరాలు అందించగా, వాటిని మంగళవారం సర్పంచ్ శంకరయ్య, ఎంపీటీసీ మధుకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా అవినాష్‌ను ఎస్సై, సర్పంచ్, ఎంపీటీసీలు అభినందించారు. మండల ప్రజలు తమ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంజయ్య, నాయకులు ఓరుగంటి అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

అంజన్న భక్తులకు అవస్థలు

- కొండగట్టులో బస్టాండ్ లేక భక్తులకు ఇబ్బందులు
- ఆదాయం ఉన్నా.. అభివృద్ధికి జాడేది?
- ఆలయ, ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం



నిరుపయోగంగా బస్టాండ్



బస్సుకోసం రోడ్డు పై ఎండలో ఎదురు చూస్తున్న భక్తులు

కొండగట్టు: కోట్లాది రూపాయల ఆదాయం వచ్చే కొండగట్టు అంజన్న ఆలయానికి వచ్చే భక్తులకు కనీసం బస్టాండ్ లేకపావడంతో ఏళ్లగా రోడ్లపై నిలబడి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు ఆలయ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో భక్తుల తీవ్ర అవస్థలు పడుతున్నారు.

బస్టాండ్ లేక ఇక్కట్లు..

కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయానికి నిత్యం వేలాదిమంది భక్తులు వస్తారు. సాధారణ రోజుల్లో వందలాది మంది రద్దీ రోజుల్లో వేలాదిమంది బస్సుల ద్వారా కొండగట్టుకు చేరుకుంటారు. దర్శనంతరం తిరుగు ప్రయాణానికి కొండమీద బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కొండ దిగేందుకు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. కొండ దిగువన బస్టాండ్ ఉన్నా.. ఉపయోగంలోకి రాకపోవడం, బస్సులు ఆగకపోవడంతో నిరుపయోగంగా మారింది. మరోవైపు ఉన్న వారికి కనీసం తాత్కాలిక షెల్టర్లు ఉండకపోవడం ఇలా కొండమీద బస్టాండ్ లేక, కొండ దిగువన బస్టాండ్ ఉపయోగంలో లేక పోవడంతో భక్తులందరూ అవస్థలు పడుతున్నారు

ఆలయ ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం

ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమయంలో మాత్రమే తాత్కాలికంగా బస్‌స్టాండ్‌ను శుభ్రం చేయడం బస్సులు ఆపడం చేస్తారు. తరువాత పట్టించుకోవడం లేదు. ఇలా కాకుండా కొండపై దిగువ ఆలయ అభివృద్ధి కానున్న నేపథ్యంలో కనీసం పట్టణాల్లో ఉండే మాదిరి తాత్కాలిక బస్సు షెల్టర్లు అటు కొండమీద ఇటు కింద చౌరస్తా వద్ద రెండు రోడ్డులకు ఇరువైపులా ఏర్పాటు చేయాలి. ఎండలు మండుతుండడంతో రోడ్డు మీద భక్తులు తాము కొనుగోలు చేసిన బొమ్మలను మోహనికి ఎండ తగులకుండా అడ్డుగా పెట్టుకుంటున్నారు. నిల్చుకునేందుకు నీడ లేక చెట్ల కింద సేదదీరుతున్నారు. ఇప్పటికైనా ఆలయ ఆర్టీసీ అధికారులు జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి భక్తుల బాధలు తీర్చాలని కోరుతున్నారు

భక్తుల గురించి ఆలోచించడం లేదు



ఎండలు దంచికొడుతున్నాయి రోడ్లమీద బస్సులు ఆగితే ఇబ్బందులు పడుతూ ఎక్కి భక్తులు పోతున్నారు ఆలయానికి, ఆర్టీసీకి ఆదాయం వస్తే చాలా భక్తుల ఇబ్బందుల గురించి మరి ఎవరు ఆలోచన చేస్తారు

– పెద్దపల్లి తేజస్వీ, హైదరాబాద్

ఇతర రాష్ట్రాల నుంచి సైతం కొండగట్టుకు



కొండగట్టుకు ఉత్తర దక్షణ తెలంగాణ నుంచి సైతం భక్తులు వస్తారు. కనీసం బస్‌స్టాండ్ లేకుంటే ఎలా? భక్తులతోనే కదా ఆలయానికి ఆదాయం అలాంటిది చిన్న సమస్య తీర్చకుంటే ఎలా భక్తుల కోరకయినా అధికారులు పాలకులు బస్‌స్టాండ్ పై ప్రత్యేక చొరవ తీసుకోవాలి

– ముత్యం శంకర్‌గౌడ్,యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు

ప్రజలను నేరుగా కలిసేందుకే 'మీరు–నేను'

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

రాయికల్: ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను తెలుసుకునేందుకే మీరునేను కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని రాజనగర్, ఆలూరు గ్రామాల్లో మీరునేను కార్యక్రమంలో భాగంగా మంగళవారం వార్డులను సందర్శించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా వారి ఇంటి వద్దకే వెళ్లి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సింగిల్ విండో చైర్మన్ దీటి రాజిరెడ్డి, సర్పంచులు భాగ్యలక్ష్మి, లక్ష్మి, ఎంపీటీసీ సురేందర్‌రెడ్డి, జిల్లా రైతుబంధు సమితి సభ్యులు రాజన్నయాదవ్, మండల యూత్ అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం వహించొద్దు



ఇంకుడుగుంత పరిశీలిస్తున్న డీపీవో, డీఎల్పీవో

కథలాపూర్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై సర్పంచులు, కార్యదర్శులు నిర్లక్ష్యం చేయవద్దని డీపీవో దేవరాజు అన్నారు. మండలంలోని సిరికొండ, తాండ్ర్యాల, కలిగోట గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఆయా వాడల్లో తిరిగి మురికికాలువలను, రోడ్లను పరిశీలించారు. ఇంకుడు గుంతలను ఏ మేరకు ఉపయోగిస్తున్నారని ప్రజలను అడిగారు. అనంతరం కంటివెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు. అయన వెంట డీఎల్పీవో శంకర్, ఎంపీడీవో జనార్ధన్, ఎంపీవో గంగాధర్, సర్పంచులు గాండ్ల వీణ, గంగప్రసాద్, ఎంపీటీసీ దొప్పల హైమావతి, కార్యదర్శులు నర్సారెడ్డి, రాజశేఖర్ ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాయికల్: పట్టణంలోని 4వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య పనులను మంగళవారం కమిషనర్ సంతోష్‌కుమార్ పరిశీలించారు. వార్డులోని మురికి కాలువల్లోని చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పారిశుధ్య పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. కౌన్సిలర్ తురగ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట సహకార సంఘంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏవో యోగితా, సీఈవో అరుణ్ మంగళవారం తెలిపారు.కావాల్సిన రైతులు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి దీపిక తెలిపారు.

రాయికల్: మండలంలోని సొసైటీలు, ఆగ్రోస్ కేంద్రాల ద్వారా రైతులకు 65 శాతం రాయితీపై జీలుగ, జనుము విత్తనాలను అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి ముక్తీశ్వర్ తెలిపారు. కావాల్సిన రైతులు ఆయా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

'రైతులకు అండగా ఉంటే రాజకీయమా'

రాయికల్: బీజేపీ నాయకులు రైతులకు అండగా ఉంటే రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అనడం సమంజసం కాదని బీజేపీ జిల్లా నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం రాయికల్, ఇటిక్యాల గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. మిల్లర్ల దోపిడీపై జిల్లా బంద్ చేపడితే దానికి సంఘీభావం పలికామే తప్పా రాజకీయం చేయలేదని, రైతుల పక్షాన పోరాటం చేసేందుకు బీజేపీ సిద్ధంగా ఉందన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాత్రం దీనిని రాజకీయం చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. రైతులు పడుతున్న సమస్యలను క్షేత్రస్థాయిలో వెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రమేశ్‌రెడ్డి, జలేందర్‌రెడ్డి, బందెల మల్లన్న, కరుణాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, బుచ్చిరెడ్డి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కథలాపూర్: మేడిపెల్లి మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2000-01 విద్యాసంవత్సరం పూర్వ విద్యార్థులు మంగళవారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. స్థానిక పీఎస్ఆర్ గార్డెన్స్‌లో విద్యార్థులు సమావేశమై తమకు చదువు చెప్పిన గురువులను శాలువాలతో సన్మానించారు. ఆట, పాటలతో ఆనందోత్సవాల మధ్య గడిపారు.

హద్దు రాళ్ల తొలగింపు

కోరుట్ల: పట్టణ శివారులోని హాజీపుర ప్రాంతంలో సర్వే నెంబర్ 326, 327 లో సుమారు 4 ఎకరాల స్థలంలో అక్రమంగా, అనధికారికంగా ఏర్పాటు చేసిన లే-అవుట్లలో మంగళవారం మున్సిపల్ అధికారులు జేసీబీతో హద్దురాళ్లను తొలగించారు. ఈ స్థలంలో విక్రయించిన ప్లాట్లను ఎవరూ కొనుగోలు చేయవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి ఏ. ప్రవీణ్ కుమార్, టీపీఎస్ఆర్ రమ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బోరు నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

కోరుట్లటౌన్: కోరుట్ల మండలం సర్వరాజ్‌పూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ గుడి బోరు నిర్మాణానికి మెట్‌పెల్లి మీనాక్షి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్వేత, అమరేశ్వర్ రూ.50 వేలు విరాళం సర్పంచ్ దానవేని సాయమ్మ మంగళవారం అందజేశారు. ఈ మేరకు గంగమ్మ గుడి స్థలంలో బోరు నిర్మాణానికి వైద్యులు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నత్తి రాజ్‌కుమార్, మల్లయ్య, మహేశ్, భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు పంపిణీ

పెగడపల్లి:సీఎం కప్‌లో భాగంగా వాలీబాల్ పోటీలో ప్రతిభ చూపి జిల్లా స్థాయిలో పాల్గొంటున్న పెగడపల్లి క్రీడాకారులకు కరీంనగర్‌కు చెందిన గుడ్‌లైఫ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో టీ షర్టులు సమకూర్చగా, మండల కేంద్రంలో మంగళవారం హాస్పిటల్ ప్రతినిధి పన్నాటి గంగాధర్ మంగళవారం క్రీడాకారులకు అందజేశారు.

ఐజీకి అభినందనలు

జగిత్యాల: ఇటీవల పదోన్నతి పొందిన ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ తెలంగాణ ఐజీ రమేశ్‌ను బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయ మాజీ చైర్మన్ గోనె ప్రదీప్‌రావు మంగళవారం కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇటిక్యాలలో మెగా రక్తదాన శిబిరం

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో డ్రీమ్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యువకులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు ఆంజనేయులు, జనరల్ సెక్రటరీ అనుపురం కార్తీక్, సర్పంచ్ సామల్ల లావణ్య, ఉపసర్పంచ్ కదార్ల చంద్రశేఖర్, ఎంపీటీసీ కొమ్ముల రాధ, సింగిల్ విండో చైర్మన్ మహిపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించండి

ధర్మపురి: డీఎస్సీ– 2003లో ఎంపికైన ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మంగళవారం విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మంత్రికి, పెద్దపెల్లి ఎంపీ వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు సమక్షంలో మంత్రి ఈశ్వర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేశ్, బాదావత్ ప్రకాశ్ నాయక్, శ్రీనివాస్ , చంద్రయ్య తదితరులున్నారు.

కంకాలమ్మ ఆలయంలో కుంకుమపూజలు



సారంగాపూర్: మండలంలోని కోనాపూర్ గ్రామ శివారులోని శ్రీ కంకాలమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. మహేంద్ర (మేదరుల) సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు, మహిళలు అధికసంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.

వెంగళాపూర్‌లో రేణుకాఎల్లమ్మ పట్నాలు

గొల్లపల్లి: మండలంలోని వెంగళాపూర్‌లో మంగళవారం రేణుకాఎల్లమ్మ పట్నాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు,గౌడ కులస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలి



ఇంటింటా ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేరాలని కోరుతూ ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పదో తరగతి పాసైన విద్యార్థుల ఇంటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివితే ఉత్తమ అధ్యాపకులతో బోధన, ఉచిత పుస్తకాలు, స్కాలర్‌షిప్ పొందవచ్చని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరించారు. లక్షలు వెచ్చించి ప్రైవేట్ కళాశాలల్లో చేరి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష్, నియాజ్ అహ్మద్, అనూష, రజిత, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి



ఇంకుడుగుంత పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

ఇబ్రహీంపట్నం: ఇంటింటికీ ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ బాలే శివాజీ అన్నారు. మండలంలోని యామాపూర్, వేములకుర్తి గ్రామాల్లో మంగళవారం ఉపాధి పనులు, ఇంకుడుగుంతల నిర్మాణాన్ని పరిశీలించారు. వేములకుర్తిలో నిర్మిస్తున్న ఇంకుడు గుంతలను పరిశీలించి 6 ఫీట్ల లోతు ఇంకుడు గుంతను తప్పనిసరిగా తవ్వాలని సూచించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన సామాజిక ఇంకుడు గుంతలను పరిశీలించారు. యామాపూర్‌లో కాంటూరు కందకాల తవ్వకాలను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేశారు. జాబ్ కార్డును పరిశీలించి జాబ్ కార్డులలో కూడా రోజులను నమోదు చేయాలని ఆదేశించారు. కూలీలు నీరసం అనిపించిన వెంటనే ఓఆర్ఎస్ ప్యాకెట్లను నీళ్లలో కలిపి తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఇన్‌చార్జి ఏపీవో వినోద్, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటాలకు జేపీఎస్‌ల క్షీరాభిషేకం



మల్లాపూర్‌లో క్షీరాభిషేకం చేస్తున్న కార్యదర్శులు

రాయికల్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయడానికి సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల మంగళవారం రాయికల్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, ఎంపీడీవో, టీజీవో జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం జేపీఎస్‌లు సీఎం కేసీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు, మంత్రి ఈశ్వర్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, మండల జేపీఎస్‌ల సంఘం అధ్యక్షుడు నదీం, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మల్యాల: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీడీవో వేంకటేశ్, ఎంపీవో వాసవికి స్వీట్లు తినిపించి, శాలువాలతో సన్మానించారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం సీఎం కేసీఆర్, అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో రాజశ్రీనివాస్‌తో కలిసి మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు నరేశ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంతోని మండల పరిషత్ కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మంగళవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శంకర్, జెడ్పీటీసీ జలేందర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, ఎంపీడీవో నవీన్ పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

జగిత్యాలరూరల్: ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేస్తామని ప్రకటించడంతో మంగళవారం జగిత్యాల మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోలు రాజేశ్వరి, శైలజ, ఎంపీవోలు కందుకూరి రవిబాబు, సలీంలను ఘనంగా సన్మానించారు.

'ఆరోగ్య మహిళ' కు విశేష స్పందన



నేరెల్ల పీహెచ్‌సీలో మహిళలకు వైద్య పరీక్షలు

ధర్మపురి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రారంభించిన ఆరోగ్య మహిళ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని నేరెల్ల ప్రాథమిక ప్రభుత్వ ఆస్పత్రి ఆరోగ్య మహిళ కింద ఎంపికైంది. ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ అవంతి, శివకుమారి ఆధ్వర్యంలో మంగళవారం ధర్మపురి, బీర్‌పూర్, తుంగూర్, బుగ్గారం మండలాల నుండి వివిధ సమస్యలతో బాధపడే మహిళలకు ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మంగళవారం 130 మందికి, 8 రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈవో రాజేశం, స్టాఫ్ నర్సులు, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

రాయికల్: మండలంలోని చెర్లకొండాపూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కొనుగోళ్లు ప్రారంభించాలని రాయికల్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డికి మంగళవారం కలిసి విన్నవించారు. 20 రోజులైనా కొనుగోళ్లు ప్రారంభించ లేదని, వెంటనే ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పల్లికొండ రమేశ్, ఆకుల రాజేందర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలి

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతీ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు అన్నారు. మంగళవారం సారంగాపూర్‌లో మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, ప్రియాంకగాంధీ యువత కోసం ప్రకటించిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొనడానికి రిజిస్ట్రేషన్ జూన్ 17 లోపు చేయించుకోవాలని, ఆన్‌లైన్ పరీక్ష 18న నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట యువజన కాంగ్రెస్ నాయకులు లైశెట్టి విజయ్, వురుమల్ల శరత్‌చంద్ర, చిరంజీవి, కాలగిరి మధు, చేకుట శేఖర్, కొక్కు ఉపేందర్ ఉన్నారు.

నేడు మెట్‌పల్లిలో బీజేపీ కార్యవర్గ సమావేశం

మెట్‌పల్లి: పట్టణంలోని వాసవీ గార్డెన్‌లో బుధవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేశ్ తెలిపారు. ఉదయం 10గంటలకు జరిగే ఈ సమావేశానికి ఎంపీ అర్వింద్‌తో పాటు జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించకపోతే జూన్ 25 నుంచి నిరవధిక సమ్మె

సారంగాపూర్: తమ సమస్యలను పరిష్కరించకపోతే జూన్ 25 నుండి నిరవధిక సమ్మె చేస్తామని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పులి మల్లేశం అన్నారు. జీపీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న సిబ్బందికి మల్టీపర్పస్ విధానం రద్దు చేసి, జీవో 51ని సవరించాలని డిమాండ్ చేశారు. దీనిపై సర్పంచ్ స్థాయి నుంచి వినతిపత్రాలను అందజేసి, చివరికి వచ్చే నెలలో నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు.